E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 11-01-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక: 11|| పేజీలు–6 www.ekaburu.com




రిలయన్స్ జియో రూ. 40,000 కోట్ల ఐపీఓ

» 4లో

## సోమ్‌నాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో మోదీ

- సోమ్‌నాథ్ ఆలయంలో మోదీ ప్రత్యేక పూజలు
- 3 వేల డ్రోన్‌లతో అద్భుత డ్రోన్ షో
- శౌర్య యాత్రలో పాల్గొననున్న ప్రధాని



గుజరాత్‌లోని ప్రసిద్ధ శైవ క్షేత్రం సోమ్‌నాథ్ మందిరాన్ని ప్రధాని మోదీ సందర్శించారు. సోమ్‌నాథ్ మందిరంపై తొలి దాడికి వెయ్యేళ్లైన సందర్భంగా నిర్వహిస్తున్న...

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సందర్శించారు. సోమ్‌నాథ్ ఆలయంపై తొలి దాడికి వెయ్యేళ్లు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న 'సోమ్‌నాథ్ స్వాభిమాన్ పర్వ్' కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఓంకార మంత్ర జపంలో పాల్గొని భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

తరువాయి 2లో

# తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం చేయూత ఇవ్వాలి






### పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హోదా కల్పించండి, హైదరాబాద్ మెట్రో ఫేజ్–2, ఆర్ఆర్ఆర్‌కు తక్షణమే అనుమతులివ్వాలి
### ప్రీ–బడ్జెట్ భేటీలో కీలక ప్రతిపాదనలు చేసిన డిప్యూటీ సీఎం భట్టి

ఈ-కబురు,న్యూఢిల్లీ: దేశ ఆర్థిక ప్రగతిలో కీలక భాగస్వామిగా ఉన్న తెలంగాణ రాష్ట్రానికి రాబోయే కేంద్ర బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యం కల్పించాలని, రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రాల ఆర్థిక మంత్రుల ప్రీ-బడ్జెట్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'వికసిత్ భారత్'లక్ష్య సాధనలో తెలంగాణ పాత్రను వివరించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల అనుమతులపై భట్టి నివేదిక సమర్పించారు.

కేంద్రం తోడ్పాటు అందించాలి...

దేశ జీడీపీలో తెలంగాణ వాటా ప్రస్తుతం 5.1 శాతంగా ఉందని, దీన్ని మరింత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని భట్టి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో 'తెలంగాణ రైజింగ్-2047'విజన్‌ను రూపొందించామని, దీని ద్వారా ప్రస్తుతం 200 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే మౌలిక సదుపాయాల కల్పన అత్యవసరమని, ఇందుకు రాష్ట్రంలో పెట్టుబడి రేటును ప్రస్తుతమున్న 37 శాతం నుంచి 50 శాతానికి (జీఎస్డీపీలో) పెంచాల్సి ఉందని, దీనికి కేంద్రం తోడ్పాటు అందించాలని కోరారు.

తరువాయి 2లో

ముంబయి అలవోకగా.. ఢిల్లీపై ఘనవిజయం

» 4లో



రోమియో.. ఎక్కడున్నావ్!

» 5లో



## ప్రజల ఆరోగ్యమే నా బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డి




- ప్రజా ఆరోగ్య విధానాల మెరుగుకు వైద్యుల సహకారం కీలకం
- స్కిల్‌ను అప్‌డేట్ చేసుకోవడం మానేస్తే కెరీర్‌కు ముగింపు పలికినట్లే..
- హైదరాబాద్ లైఫ్‌సైన్స్, ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది..

ఈ-కబురు, హైదరాబాద్: డాక్టర్లు కేవలం వైద్య నిపుణులే కాదు.. సమాజానికి దిక్సూచి వంటివారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 'నేను డాక్టర్‌ను కాదు.. కానీ సోషల్ డాక్టర్‌ను. ప్రజల ఆరోగ్యమే నా బాధ్యత' అని వ్యాఖ్యానించారు. హై

తరువాయి 2లో




## మహిళా అధికారులపై దుష్ప్రచారం.. ఐపీఎస్ సంఘం ఆగ్రహం

తరువాయి 3లో



## నిరుద్యోగుల ఆందోళన.. పోలీసుల అప్రమత్తం

తరువాయి 2లో

### సంక్రాంతి రద్దీ..కిటకిటలాడుతున్న
## బస్టాండ్లు , రైల్వే స్టేషన్లు

- పల్లెబాట పట్టిన జనం
- కిటకిటలాడుతున్న బస్టాండ్లు , రైల్వే స్టేషన్లు
- ఏ మూలకూ సరిపోని ఆర్టీసీ బస్సులు
- నిలువు దోపిడీ చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్



ఈకబురు,: తెలుగు రాష్ట్రాల ప్రజలు ఘనంగా జరుపుకునే పండుగల్లో సంక్రాంతి ముఖ్యమైంది. ఈ పండుగను పట్టణాలు, నగరాల్లో కంటే సొంత ఊర్లలో జరుపుకునేందుకు ప్రజలు ఇష్టపడుతుంటారు. విద్యా సంస్థలకు కూడా సెలవులు ఇవ్వడంతో కుటుంబ సమేతంగా ఊర్లకు ప్రయాణమవుతుంటారు. ఇలా సొంత ఊర్లకు వెళ్తున్న వారిని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు నిలువుదోపిడీ చేస్తున్నాయి. వెళ్లే వారి రద్దీకి తగ్గట్లుగా ఆర్టీసీ బస్సులు, రైళ్లు లేకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లోనే అధిక ధరలు వసూలు చేసే ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ ఇక సంక్రాంతి సందర్భంగా మామూలుగా ఉండదు. ఆర్టీసీ బస్సులు ఏమూలకూ సరిపోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. దీంతో పండుగ సెలవుల్లో విశాఖ, విజయవాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, బెంగళూరు, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లే వారు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీనిని సొమ్ముచేసుకోవడానికి ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు టికెట్ ధరలను అమాంతంగా పెంచేశారు. ఈ క్రమంలో ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీని అరికట్టేందుకు, ఫిట్ నెస్ లేని బస్సులు కూడా రోడ్డు మీదకు వస్తున్నాయి. పండుగకు ఏపీకి వెళ్లే వారు లక్షల్లో ఉండడంతో దాదాపు నగరం చాలా వరకు ఖాళీ అవుతున్నది. ఇది ప్రతి సంవత్సరం వస్తున్న ఆనవాయితీ అయినప్పటికీ రద్దీకి తగ్గట్లుగా బస్సులు నడపడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని దోపిడీని కొనసాగిస్తూ ప్రైవేట్ ట్రావెల్స్ మాఫియాలా మారాయనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

తరువాయి 2లో



## వీసా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులు పెంచిన అమెరికా

ఈ-కబురు,వాషింగ్టన్: హెచ్-1బీ, ఎల్-1 వంటి వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులను అమెరికా పెంచింది (Visa Premium Processing Fee). 2,805 డాలర్ల నుంచి 2,965 డాలర్లకు పెంచింది. మార్చి 1 నుంచి ఈ పెంపు అమల్లోకి రానుంది. మిగతా వీసా కేటగిరీల ప్రాసెసింగ్ ఫీజుల్లోనూ మార్పులు చేసింది.

» 2లో

# తీరం దాటిన వాయుగుండం..



ఈ-కబురు,విశాఖపట్నం: బంగాళాఖాతంలో శ్రీలంక సమీపంలోని తీవ్ర వాయుగుండం.. శనివారం వాయుగుండంగా బలహీనపడింది. సాయంత్రం శ్రీలంకకు ఈశాన్యంగా ముల్లయిట్టివుకు సమీపంలో తీరం దాటినట్లు భారత వాతావరణ విభాగం పేర్కొంది.

» 2లో

### మియాపూర్‌లో హైడ్రా సంచలనం
## రూ.3 వేల కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం

- మియాపూర్‌లో హైడ్రా భారీ దాడి
- రూ.3 వేల కోట్ల ప్రభుత్వ భూమి రికవరీ
- తప్పుడు పత్రాలతో కబ్జా యత్నం బట్టబయలు
- చెరువు కట్టపై అక్రమ షెడ్లు తొలగింపు
- సర్వే నెం.44 భూమి హైడ్రా స్వాధీనం



ఈ-కబురు,:హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. రూ.3వేల కోట్లకుపైగా విలువ చేసే ప్రభుత్వ భూమిని అక్రమార్కుల చెర నుంచి విడిపించింది. మక్తా మహబూబ్ పేటలోని సర్వే నెంబరు 44లో తప్పుడు పత్రాలతో 43 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

తరువాయి 2లో

ఈ-కబురు
11- 01 -2026
ఆదివారం
e-kaburu.com

## సోమ్‌నాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో మోదీ

మందిరంలో ఆయన ప్రత్యేక పూజలు చేయడంతో పాటు ఓంకార మంత్ర జపంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందిర విశేషాలతో నిర్వహించిన ప్రత్యేక డ్రోన్ షోను ఆయన వీక్షించారు. 3వేల డ్రోన్‌లను ఇందుకు వినియోగించారు. 1026 జనవరిలో మహ్మద్ ఘజని ఈ పుణ్యక్షేత్రంపై దాడి జరిపిన సందర్భంగా నిర్వహిస్తున్న స్వాభిమాన్ పర్వ్ ఈ నెల 11 దాకా జరగనుంది. సోమ్‌నాథ్ ఆలయాన్ని కాపాడే క్రమంలో ప్రాణ త్యాగం చేసిన వారిని స్మరించుకుంటూ నిర్వహించే శౌర్య యాత్రలో మోదీ పాల్గొంటారు. 108 గుర్రాలతో ఆదివారం ఈ శౌర్య యాత్ర నిర్వహించనున్నారు.

మందిర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక డ్రోన్ షోను ప్రధాని వీక్షించారు. ఆలయ చరిత్ర, భారతీయ సంస్కృతి, శైవ సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ షోలో సుమారు 3 వేల డ్రోన్‌లను వినియోగించారు. ఆకాశంలో వెలిగిన దృశ్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

1026 జనవరిలో మహ్మద్ ఘజని సోమ్‌నాథ్ ఆలయంపై దాడి చేసిన ఘటనకు వెయ్యేళ్లు పూర్తైన సందర్భంగా ఈ స్వాభిమాన్ పర్వ్‌ను నిర్వహిస్తున్నారు. భారతీయ ఆధ్యాత్మిక వారసత్వం, ధైర్యసాహసాలను గుర్తు చేస్తూ ఈ కార్యక్రమాలు ఈ నెల 11వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

సోమ్‌నాథ్ ఆలయ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ నిర్వహించే శౌర్య యాత్రలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ఆదివారం జరగనున్న ఈ యాత్రలో 108 గుర్రాలతో వీర గాథలను ప్రతిబింబించేలా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ యాత్ర ద్వారా దేశ చరిత్రలోని త్యాగాలు, శౌర్యాన్ని నేటి తరానికి తెలియజేయాలన్నదే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా విశేష ప్రాధాన్యం సంతరించుకుని, ఆధ్యాత్మికతతో పాటు జాతీయ గర్వాన్ని మరింత బలపరుస్తోంది.



## సంక్రాంతి రద్దీ..కిటకిటలాడుతున్న బస్టాండ్లు , రైల్వే స్టేషన్లు

**ప్రైవేట్ ట్రావెల్స్ నిలువు దోపిడీ..**
పండుగకు ఊరెళ్లే ప్రయాణికుల నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు మూడు రెట్లు అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. రద్దీకి తగ్గట్లుగా ఏపీ, తెలంగాణకు వెళ్లేందుకు సరిపడా బస్సులు లేకపోవడం ట్రావెల్స్ యాజమాన్యాలకు కలిసి వస్తున్నది. ప్రయాణికులను నిలువునా ముంచేస్తున్నాయి. ప్రైవేట్ ట్రావెల్‌స్‌లో ఏ బస్సు ఎక్కినా ఇదే తంతు. ఏసీ, నాన్ ఏసీ, సీటింగ్, స్లీపర్ అన్నింట్లోనూ ఇదే తరహాలో చార్జీలు వసూలు చేస్తున్నారు . గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రజలు ప్రయాణాలు చేస్తున్నారు.

**తూతూమంత్రంగా కేసులు..**
ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఇంతలా ప్రయాణికులను దోచేస్తుంటే ఆర్టీవో, రవాణా శాఖ అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. పండుగ సందర్భంగా అధికారులు తనిఖీలు చేసే అవకాశం ఉంటుందని ముందుగానే పసిగట్టిన ట్రావెల్స్ యాజమాన్యాలు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటూ తమ దోపిడీని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. హైవేలను వదిలేసి ఇతర మార్గాల ద్వారా వాహనాలు నడిపిస్తున్నారు. దీంతో అధికారుల తనిఖీల్లో అతి కొద్ది మంది అక్రమార్కులు మాత్రమే పట్టుబడుతున్నారు.

**రోడ్లపై తగ్గిన ట్రాఫిక్..**
సంక్రాంతి పండుగ కోసం ప్రజలు ఊర్ల బాట పట్టడంతో హైదరాబాద్ నగర రోడ్లపై ట్రాఫిక్ తగ్గింది . నిత్యం ట్రాఫిక్ రద్దీ, జాంలతో ఇబ్బందిపడే వాహనదారులు సిటీ రోడ్లపై సాఫీగా ప్రయాణం చేస్తున్నారు. కోటికి పైగా జనాభా ఉన్న హైదరాబాద్ నగరం నుంచి సుమారు 15 నుంచి 20 లక్షల వరకు సొంతూళ్లకు వెళ్లొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రాబోయే రెండు రోజులు నగరం మరింతగా ఖాళీ కానున్నది. మొత్తం మీద సంక్రాంతి పండుగ హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇక్కట్లను తప్పించడంతో రోడ్లపైకి పనుల మీద వచ్చిన వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కిటకిటలాడుతున్న బస్టాండ్లు,రైల్వే స్టేషన్లు..
సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు వెళ్లేవారితో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. గ్రామాలకు వెళ్లే ప్రయాణాలకు అసౌకర్యం కలగకుండా ఉండేలా అదనపు బస్సులను పెట్టి తగిన ఏర్పాట్లు చేశారు. అయినా అవి ఏ మూలకూ సరిపోకపోవడంతో ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్నారు. మరో మూడు రోజుల్లో పండుగ ఉండడంతో ఊరెళ్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ ట్రావెల్స్ నిలువు దోపిడీని నిలువరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.





## వీసా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులు పెంచిన అమెరికా




**ఈమేరకు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (USCIS) ఓ ప్రకటనను విడుదల చేసింది. జూన్ 2023 నుంచి జూన్ 2025 మధ్య ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ ఫీజు పెంచినట్లు వెల్లడించింది.**

**వీసా దరఖాస్తులను వేగంగా ప్రాసెస్ చేయడానికి ఈ అదనపు రుసుమును వసూలు చేస్తారు. హెచ్-1బీ, ఎల్-1,ఒ-1,పీ-1, టీఎన్ వీసాల (ఫారం I-129) విషయంలో ప్రీమియం ఫీజు $2,805 నుంచి $2,965కు పెరగనుంది. ఎఫ్-1, జే-1 వంటి వీసాల (ఫారం I-539) విషయంలో ఫీజును $1,965 నుంచి $2,075కు పెంచింది. ఈ పెంపు ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రీమియం ప్రాసెసింగ్ సర్వీసులు అందించడానికి ఉపయోగిస్తామని యూఎస్‌సీఐఎస్ వెల్లడించింది. ఇతర దేశాలతో పాటు భారత్‌కు చెందిన విద్యార్థులు, వృత్తి నిపుణులపై ఈ ఫీజు ప్రభావం ఉంటుంది.**

## తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం చేయూత ఇవ్వాలి







**పన్నుల పంపిణీలో అన్యాయం...**
రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో 41 శాతం వాటా ఇవ్వాలని 15వ ఆర్థిక సంఘం స్పష్టంగా సిఫారసు చేసినప్పటికీ, ఆచరణలో మాత్రం 30 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం విధిస్తున్న సెస్సులు, సర్ చార్జీల వాటా 20 శాతానికి చేరడమే ఇందుకు కారణమన్నారు. దాదాపు రూ.1,55,000 కోట్ల సర్ చార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలని లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు న్యాయబద్ధమైన వాటా పంచాలని ఆయన సూచించారు. అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాల అమలులో రాష్ట్రాల వాటాను తగ్గించి, ఆ నిధులను (దాదాపు రూ.2.21 లక్షల కోట్లు) నేరుగా రాష్ట్రాలకే బదిలీ చేయాలని కోరారు. రాష్ట్రాల ఆర్థిక వెసులుబాటు కోసం ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలని భట్టి డిమాండ్ చేశారు. విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నుంచి మినహాయించాలని కోరారు.

**భారీ ప్రాజెక్టులకు అనుమతులు, నిధుల కోసం...**
రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని, హైదరాబాద్ మెట్రో రెండో దశకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని భట్టి కోరారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని స్పష్టం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ.14,100 కోట్లు, హైదరాబాద్‌లో రేడియల్ రోడ్ల కోసం రూ.45,000 కోట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ కోసం రూ.17,212 కోట్లు కేటాయించాలని కోరారు. పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో కొత్త విమానాశ్రయాలను మంజూరు చేయాలని, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటును ప్రకటించాలని భట్టి తన ప్రసంగంలో ప్రస్తావించారు.

బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ముఖ్యమైన అంశాలు:
'తెలంగాణ ప్రభుత్వం తరపున, నా తరపున.. రాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఒక దేశం కేంద్రరాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బడ్జెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని నేను నమ్ముతున్నాను.

2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నాను.

**ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం.**
మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాము. దీని ద్వారా తెలంగాణను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుంచి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నాం. తద్వారా దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము.

మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి (GSDPలో) పెంచాల్సి ఉంది.

రాష్ట్రాల ద్రవ్య లోటు (Fiscal Deficit) పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి.

రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరుతున్నాము. విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను FRBM పరిమితుల నుంచి మినహాయించాలి.

తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము.

కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోంది. ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచిస్తున్నాము.

ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరింది. దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ.. రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది. దాదాపు రూ.1,55,000 కోట్ల సర్ చార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలి. లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.

**తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ (RRR) ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాము.**

**హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి.**

**హైదరాబాద్‌లో IIM ఏర్పాటును ప్రకటించాలి. మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి.**

**పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలి.**

**పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని(PRLI) జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి.**

**మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ.14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ.45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ.17,212 కోట్లు కేటాయించాలి.**

**సహకార సమాఖ్య స్ఫూర్తితో మా అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము' అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.**

### మియాపూర్‌లో హైడ్రా సంచలనం

## రూ.3 వేల కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం

మొదటి పేజి తరువాయి



159 సర్వే నెంబర్‌లోని భూమి పత్రాలతో సర్వే నెం.44లోని ప్రభుత్వ భూమిలో ఇప్పటికే ఎకరంన్నర వరకు ఇమ్రాన్ అనే వ్యక్తి కబ్జా చేయగా అతనిపై కేసు నమోదైంది. అలాగే మరో 5 ఎకరాలను కూడా ఆక్రమణల చెర నుంచి హైడ్రా విడిపించింది. మియాపూర్ బాచుపల్లి ప్రధాన రహదారికి సమాంతరంగా చెరువు కట్టపై 200 మీటర్ల మేర మట్టి పోసి ఏర్పాటు చేసిన 18 షెట్టర్లను కూడా హైడ్రా తొలగించింది. ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. సర్వే నెం.44లోని ప్రభుత్వ భూమిపై విచారణ జరిపించారు. అందులోని అక్రమ రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు. కబ్జాదారుల కన్ను ప్రభుత్వ భూమిపై పడిందని నిర్ధారించిన హైడ్రా అధికారులు.. సమగ్ర విచారణ జరిపి మక్తా మహబూబ్ పేటలోని ఆ భూమిని స్వాధీనం చేసుకొని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్డులు పెట్టారు.

### నిరుద్యోగుల ఆందోళన..

## పోలీసుల అప్రమత్తం



**ఈ-కబురు, దిల్‌సుఖ్‌నగర్, : జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. వారు మెరుపు ధర్నాకు దిగే అవకాశముందన్న సమాచారంతో హైదరాబాద్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముఖ్య కూడళ్లు, బస్‌స్టాప్‌లు, మెట్రో పరిసర ప్రాంతాల్లో బందోబస్తు చేపట్టారు. అయినప్పటికీ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఇందిరమ్మ క్యాంటీన్, మరోచోట నిరుద్యోగులు బైఠాయించారు. గుంపులుగా చేరిన వారిని పోలీసులు చెదరగొట్టి శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చర్యలు చేపట్టారు.**

## తీరం దాటిన వాయుగుండం.



**శనివారం సాయంత్రానికి ముల్లయిట్టివుకు 30 కిలోమీటర్లు, జాఫ్నా (శ్రీలంక)కు 70 కి.మీ, మన్నార్ (శ్రీలంక)కు 90, కరైకల్ (పుదుచ్చేరి)కి 190, చెన్నైకు 400 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ దిశగా కదులుతూ ఆదివారం ఉదయంలోగా తీవ్ర అల్పపీడనంగా బలహీనపడే అవకాశముంది. దీని ప్రభావంతో ఆదివారం తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షా లు కురిసే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. దక్షిణ కోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షా లు కురవొచ్చని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. న్నారు.**

# ప్రజల ఆరోగ్యమే నా బాధ్యత: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ హెచ్ఐసీసీలో శనివారం ఫెలోస్ ఇండియా సదస్సులో భాగంగా ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ (ఐసీఆర్‌టీఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇలాంటి అంతర్జాతీయ స్థాయి వైద్య సదస్సును నిర్వహించడం గర్వకారణమని చెప్పారు. ఈ సదస్సుకు భారత్‌తోపాటు ఆగ్నేయాసియా దేశాల నుంచి 500 మందికి పైగా యువ కార్డియాలజిస్టులు హాజరుకావడాన్ని ఆయన అభినందించారు. ఇప్పటికే సక్సెస్‌ఫుల్ కార్డియాలజిస్టులైన డాక్టర్లు కూడా జ్ఞానం, నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాలనే సంకల్పంతో ఈ సదస్సుకు రావడం అభినందనీయమన్నారు. నిరంతరం నేర్చుకోవడమే అతిపెద్ద విజయ రహస్యమని, కొత్త విషయాలు తెలుసుకోవడం, స్కిల్స్‌ను అప్‌డేట్ చేసుకోవడం మానేస్తే కెరీర్‌కు ముగింపు పలికినట్టేనని పేర్కొన్నారు. సాంకేతికత అతివేగంగా మారుతున్న నేపథ్యంలో వైద్య రంగం కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి వాటితో ముడిపడుతోందన్నారు. అందుకే ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అయితే, ప్రజల నాడి పట్టుకోవడాన్ని మాత్రం ఎప్పటికీ మర్చిపోవద్దని హితవు పలికారు.



**హెల్త్‌కేర్ హబ్‌గా హైదరాబాద్**

లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్ అనుబంధ రంగాల్లో హైదరాబాద్ ఆవిష్కరణల కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డాక్టర్లు కావాలని చాలామంది ఆశపడతారని, కానీ అందరికీ ఆ అవకాశం దక్కదని చెప్పారు. అందుకే డాక్టర్లు సమాజంలో ఒక ప్రత్యేక వర్గమని, ప్రజల ప్రాణాలు కాపాడే గొప్ప బాధ్యత మీపైన ఉందని గుర్తుచేశారు. ప్రజా ఆరోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం హెల్త్ పాలసీలను మెరుగుపరచడంలో వైద్యుల సహకారం కీలకమని, మీ సలహాలు, సూచనలతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.

**గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తే...**

ఇటీవలి కాలంలో గుండె జబ్బులతో మరణాలు పెరుగుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో అందరూ భాగస్వాములవ్వాలని వైద్యులకు పిలుపునిచ్చారు. విద్యార్థులకు సీపీఆర్ శిక్షణను స్వచ్ఛందంగా అందించేందుకు కార్డియాలజిస్టులు ముందుకొస్తే అనేక ప్రాణాలను కాపాడగలమని చెప్పారు. చాలా సందర్భాల్లో నివారణపై నిర్లక్ష్యం చేస్తామని, కానీ ప్రజలకు అవగాహన కల్పిస్తే సమాజం మొత్తంగా లాభపడుతుందన్నారు.

క్వాలిటీ ఆఫ్ హెల్త్ కేర్ విషయంలో అందరూ కృషి చేయాలని, ఆరోగ్య సంరక్షణలో భారత్.. వరల్డ్ బెస్ట్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతీ వైద్యుడు ఉత్తమంగా ఎదగాలన్నదే తన కోరికని సీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫెలోస్ ఇండియా ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ శరత్ రెడ్డి, మెడికవర్ సీఎండీ డాక్టర్ అనిల్ కృష్ణ, మెడికవర్ సీఈవో డాక్టర్ హరికృష్ణ, మాజీ సీఎస్ఐ అధ్యక్షుడు పీసీ రథ్ పాల్గొన్నారు.

# కాలనీ మధ్యలో ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీ..
# ఇబ్బందులు పడుతున్న స్థానికులు



విద్యుత్ నగర్ కాలనీలో ఇళ్ల మధ్య కొనసాగుతున్న ఐరన్ ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీ



విద్యుత్ నగర్ కాలనీలో ఇళ్ల మధ్య కొనసాగుతున్న ఐరన్ ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీ

**గ్రైండింగ్, వెల్డింగ్ వర్కులతో మోత**

**దుమ్ము, దుర్వాసనతో కాలనీ వాసుల నరకయాతన**

**ఫిర్యాదులు చేసినా ఫలితాలు శూన్యం**

ఈకబురు, పటాన్‌చెరు :
జనావాసాలకు దూరంగా నడపాల్సిన ఫ్యాక్టరీలను కాలనీ మధ్యలో నడిపిస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాటివల్ల నిత్యం పొల్యూషన్ విడుదలై కాలనీ వాసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. భారతీనగర్ జీహెచ్ఎంసీ పరిధిలోని ఎంఐజీ ఫేజ్ 2 విద్యుత్ నగర్ కాలనీలో ఈ సమస్య కొన్నేళ్లుగా కొనసాగుతోంది. కాలనీకి మధ్యలో ఉండే రోడ్డు నంబర్ 6 లో ఏర్పాటు చేసిన ఐరన్ ఫ్యాబ్రికేషన్ పరిశ్రమ వల్ల అక్కడి ప్రజలు ప్రతిరోజు నరకం అనుభవిస్తున్నారు. కాలనీ వాసుల అవసరాల కోసం కిరాణ షాపులు, కురగాయలు, మిల్క్ సెంటర్ లాంటి వాటి కోసం కేటాయించిన సముదాయాలలో నిబంధనలకు విరుద్ధంగా ఐరన్ ఫ్యాబ్రికేషన్ కంపెనీకి ఇచ్చారని స్థానికులు మండి పడుతున్నారు. ఉదయం, రాత్రి తేడా లేకుండా ఐరన్ కట్టింగ్ వర్కులు చేస్తుండడంతో విపరీతమైన శబ్ధాలు, నల్లటి పొగ కమ్మేస్తోందని వాటివల్ల ప్రశాంతగా ఉండలేకపోతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవీకాక ఐరన్ గ్రైండింగ్, వెల్డింగ్ వర్కులతో కాలనీ అంతా మోత మోగిస్తున్నారని, వాటివల్ల వచ్చే పొల్యూషన్‌తో తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. సదరు ఫ్యాబ్రికేషన్ కంపెనీలో పని చేసే వర్కర్లు మద్యం సేవించి బాటిళ్లు, ఇతర సామాగ్రి రోడ్లపైనే ఇష్టానుసారం పడేస్తున్నారని, స్థానికులు ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయంపై కాలనీ వాసులు స్థానిక అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు మాత్రం తీసుకోలేదని, సోమవారం కలెక్టర్ కార్యాయలంలో జరిగే ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాలనీ మధ్యలో ఉన్న ఫ్యాబ్రికేషన్ కంపెనీని అక్కడి నుంచి తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుకుంటున్నారు.

# స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శం
# గంగల రాధాకృష్ణ యాదవ్



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం




శారదా స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న రాధాకృష్ణ యాదవ్

**కొండాపూర్ లో ఘనంగా స్వామి వివేకానంద జయంతి**

ఈకబురు, శేరిలింగంపల్లి : స్వామి వివేకానంద జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం అని బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడు గంగల రాధాకృష్ణ యాదవ్ అన్నారు. కొండాపూర్ లోని శారదా హైస్కూల్ లో శనివారం నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి వేడుకలకు రాధాకృష్ణ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ స్వామి వివేకానంద నరుడే నారాయణుడని, మానవసేవే మాధవ సేవ అని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. యువశక్తి అనేది అను శక్తి కంటే బలమైనదని, యువజన చైతన్యమే లక్ష్యంగా యువత యొక్క భాగస్వామ్యాన్ని దేశ అభివృద్ధికి బాటలు వేసేలా భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు దేశ విదేశాల్లో చాటి చెప్పిన మహానుభావుడన్నారు. నేటి యువత అతని సూక్తులను ఆదర్శంగా తీసుకొని ప్రపంచం గుర్తించేలా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శారద స్కూల్ సిబ్బంది, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# మహిళా అధికారులపై దుష్ప్రచారం.. ఐపీఎస్ సంఘం ఆగ్రహం




ఈకబురు, హైదరాబాద్: తెలంగాణలోని మహిళా ఐఏఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకుని, కొన్ని మీడియా సంస్థలు సాగిస్తున్న అసత్య ప్రచారాలపై తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రస్థాయిలో మండిపడింది. మహిళా అధికారుల వ్యక్తిత్వ హననానికి పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని సంఘం ఆరోపించింది. ఈ విషయంలో ఐఏఎస్ అధికారుల సంఘానికి తమ సంపూర్ణ సంఘీభావాన్ని ఐపీఎస్ అసోసియేషన్ ప్రకటించింది. నిరాధారమైన ఆరోపణలతో ప్రభుత్వ అధికారుల ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాలను తీవ్రంగా ఖండించింది.

ఐపీఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఇతర సభ్యులు ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళా అధికారులు ఎంతో చిత్తశుద్ధి కలిగి, ధైర్యంతో, వృత్తి నైపుణ్యంతో సమాజం కోసం విధులు నిర్వర్తిస్తున్నారని, వారిపై ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు అధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తాయని అసోసియేషన్ ఆ ప్రకటనలో పేర్కొంది.

మరిన్ని కనుగొనండి
జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్

సదరు మీడియా సంస్థలు తక్షణమే తమ తప్పును సరిదిద్దుకోవాలని ఐపీఎస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. చేసిన తప్పును అంగీకరిస్తూ, బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని, సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలోని అభ్యంతరకర కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన మీడియా, మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికింది. ఇటువంటి అసత్య ప్రచారాలను ఇకపై ఉపేక్షించే ప్రసక్తే లేదని తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం హెచ్చరించింది.

# నన్ను అవమానించి ఏం సాధిస్తారు?



ఈకబురు హైదరాబాద్: ''దేవుడు అంటే నాకు నమ్మకం.. నేను తెలిసి ఏ తప్పూ చేయను. నా కుమారుడు చనిపోయినప్పుడే నేను సగం చనిపోయా. ఇంకా నన్ను మానసికంగా ఇబ్బంది పెట్టొద్దు. నన్ను అవమానించి ఏం సాధిస్తారు? నేను తప్పు చేస్తే దేవుడు శిక్షిస్తాడు. చేతులెత్తి నమస్కారం చేస్తున్నా.. తప్పుడు కథనాలు ప్రచారం చేయొద్దు'' అంటూ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అధికారులపై తప్పుడు కథనాలు ప్రసారం చేశారని.. వారిని మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ''రాజకీయాల్లో విమర్శలు సహజం. రాజకీయ నాయకులమైనా మేము తట్టుకుంటాం. ఐఏఎస్ అధికారుల కుటుంబాలు ఎలా తట్టుకుంటాయి? ఏం ఆధారాలు ఉన్నాయని ఇష్టం వచ్చినట్లు టీవీలో ప్రసారం చేస్తారు? ఇదంతా ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలన్న ఉద్దేశమేమో అన్న అనుమానం కలుగుతోంది. మీకూ కుటుంబాలు ఉంటాయి. కాస్త ఆలోచించండి. కలెక్టర్ల బదిలీలో నా ప్రమేయం ఉందని అన్నారు. వారిని బదిలీ చేసే అధికారం మంత్రుల చేతుల్లో ఉండదు. జిల్లా మంత్రులకు సమాచారం ఇచ్చి బదిలీలు చేయరు. సీఎం, సీఎస్ మాత్రమే బదిలీలు చేస్తారు. ఎంతో కష్టపడితే ఐఏఎస్, ఐపీఎస్ అవుతారు. అలాంటి వారిపై అభాండాలు వేయవద్దు. అసత్య ప్రచారంపై డీజీపీ శివధర్‌రెడ్డితో మాట్లాడా. సమగ్రంగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీజీపీ చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో సీఎంతో సహా మంత్రులపై దుష్ప్రచారం చేయడం సరికాదు'' అంటూ భావోద్వేగంతో మాట్లాడారు.

**పుష్ప సినిమా తర్వాత బెనిఫిట్ షోలు.. టికెట్ ధరల పెంపు ఉండదని చెప్పా**

''సినిమా పరిశ్రమపై దృష్టి పెట్టలేదు. పుష్ప సినిమా తర్వాత బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు ఉండదని చెప్పా. దీని కోసం నా వద్దకు రావొద్దన్నా. తాజాగా సినిమా టికెట్ల ధరల పెంపునకు సంబంధించిన ఏ దస్త్రమూ నా వద్దకు రాలేదు. టికెట్ల ధర పెంపుపై నన్ను ఎవరూ సంప్రదించలేదు. ఎదుటివారు బాధపడితే స్పందించే గుణం నాది. పుష్ప సమయంలో మహిళ చనిపోతే రూ.25 లక్షల సాయం అందించా. బాధిత అబ్బాయిని సాదుకుంటాను...చదివిస్తాను అని చెప్పా'' అని మంత్రి వివరించారు.

**రద్దీ ఉన్నప్పుడు టోల్ గేట్లు ఎత్తేయాలని కేంద్రానికి చెప్పా**

''సంక్రాంతి పండగకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. కేవలం టోల్‌గేట్ల వద్ద ఒకటిన్నర నిమిషం వరకు ఆలస్యం జరుగుతోంది. రెండు రోజుల కిందటే సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని చెప్పా. రద్దీ ఎక్కువ ఉన్నప్పుడు టోల్‌ఛార్జీలు లేకుండా గేట్లు ఎత్తివేయాలని కేంద్రానికి చెప్పా. రద్దీ దృష్ట్యా ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలి. ప్రతి 20 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేశాం. అత్యవసర పరిస్థితుల కోసం టోల్‌ఫ్రీ నంబరు అందుబాటులో ఉంటుంది. ప్రమాదం జరిగితే అవసరమైతే హెలికాప్టర్‌లో ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తాం'' అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

# పురపాలికలపై కాంగ్రెస్ నిర్లక్ష్యం


ఈకబురు హైదరాబాద్: హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో రాష్ట్రంలోని పురపాలికలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు కాంగ్రెస్‌కి గుణపాఠం చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. ఖమ్మం, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల భారాస నాయకులు, కార్యకర్తలతో హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన పురపాలక ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ''భారాస ప్రభుత్వం నిధులు కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలకు మరోసారి శిలాఫలకాలు వేయడం మినహా... ఈ ప్రభుత్వం చేసిన పని ఒకటీ లేదు. గత ప్రభుత్వం ప్రారంభించిన మౌలిక వసతుల ప్రాజెక్టులు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, మోడల్ మార్కెట్ల వంటి అనేక కార్యక్రమాలకు నిధులు నిలిపివేయడంతో... అవన్నీ అర్ధంతరంగా ఆగిపోయాయి. ఒకవైపు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టారు. అదేసమయంలో పట్టణాలనూ పట్టించుకోలేదు. ఇప్పుడేం ముఖం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుంది? కాంగ్రెస్ నేతలు మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వస్తే... తమ వీధులు, పట్టణాలకు ఏమేరకు నిధులిచ్చారని ప్రజలంతా నిలదీయాలి. పురపాలక ఎన్నికల్లో భారాస అభ్యర్థులు విజయం సాధించడం ఖాయం. పార్టీ నేతలు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఎన్నికలకు సన్నద్ధం కావాలి. మెరుగైన ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలి'' అని పిలుపునిచ్చారు.

**ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది: హరీశ్‌రావు**

పార్టీ సీనియర్ నేత, శాసనసభ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు కూడా వివిధ అంశాలపై నేతలకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో తీవ్ర వ్యతిరేకత ఉందని, భారాసకు అనుకూల వాతావరణ ఉందని తెలిపారు. కలిసికట్టుగా పోరాడి... ఎన్నికల్లో మంచి విజయం నమోదు చేయాలని కోరారు. పురపాలక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పలు అంశాలను హరీశ్‌రావు నేతలకు వివరించారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు జగదీశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, అజయ్‌కుమార్, నామా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

**హార్వర్డ్‌లో సదస్సుకు కేటీఆర్‌కు ఆహ్వానం**

అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ, 23వ 'ఇండియా కాన్ఫరెన్స్ ఎట్ హార్వర్డ్'లో ప్రసంగించాల్సిందిగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు నిర్వాహక ప్రతినిధులు శనివారం ఆహ్వాన పత్రం అందించారు. 'ది ఇండియా వి ఇమేజిన్' అనే థీమ్‌తో ఫిబ్రవరి 14, 15 తేదీల్లో హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈ సదస్సును నిర్వహించనున్నారు. 15న ప్రసంగించాల్సిందిగా కేటీఆర్‌ను నిర్వాహకులు కోరారు. విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించే అతిపెద్ద ఇండియా కాన్ఫరెన్స్‌లలో ఒకటిగా ఈ కాన్ఫరెన్స్ గుర్తింపు పొందింది. భారత్‌తో పాటు దక్షిణ ఆసియా దేశాల నుంచి వచ్చిన విద్యార్థులు, వ్యాపారవేత్తలు, సాంస్కృతిక రంగ ప్రముఖులు కలిపి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారు.



## వొడాఫోన్ ఐడియాకు భారీ ఊరట

**–వచ్చే ఆరేళ్లలో ఏటా రూ.124 కోట్లు కడితే చాలు**
**–వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం**



అప్పుల్లో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్న టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియాకు భారీ ఊరట కలిగించే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. వచ్చే ఆరేళ్ల పాటు, ఏటా చెల్లించాల్సిన బకాయిలకు రూ.124 కోట్ల పరిమితి విధించింది. 2032 మార్చి నుంచి 2035 మార్చి వరకు, ఏటా రూ.100 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఆ మేరకు టెలికాం విభాగం (డాట్) నుంచి సమాచారం అందిందంటూ ఎక్స్ఛేంజీలకు వొడాఫోన్ ఐడియా సమాచారం ఇచ్చింది. అంటే పదేళ్లలో కలిపి రూ.1,144 కోట్లు మాత్రమే ఈ సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయ (ఏజీఆర్) బకాయిల్లో మిగతా మొత్తాన్ని 2036 మార్చి నుంచి, ఆరేళ్ల పాటు సమాన వాయిదాల రూపంలో కట్టాల్సి ఉంటుందనీ అందులో తెలిపింది. కేంద్ర ప్రయోజనాల కోసమే: వొడాఫోన్ ఐడియా బకాయిలను రూ.87,695 కోట్ల వద్ద ఫ్రీజ్ చేస్తూ, వాటిని 203132 నుంచి 204041 మధ్య కట్టొచ్చని పేర్కొంటూ, డిసెంబరు 31న పాక్షిక మారటోరియానికి కేంద్రం అనుమతులిచ్చిన సంగతి తెలిసిందే. ఈ మొత్తాన్ని కూడా ఆడిట్ ఆధారంగా ఒక కమిటీ తిరిగి మదింపు చేస్తుంది. ప్రభుత్వానికి వొడాఫోన్ ఐడియాలో 48.9% వాటా ఉండడం, 20 కోట్ల మంది వినియోగదార్లు, కేంద్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఊరట చర్యలను ప్రకటించింది. ఈ వార్తల నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా షేరు బీఎస్ఈలో ఉదయం ట్రేడింగ్‌లో 9% లాభపడింది. అయితే 5జీ విస్తరణ ప్రణాళికలకు సంస్థ నిధులు ఖర్చు చేయాల్సి ఉందంటూ, విశ్లేషకులు పేర్కొనడంతో, చివరకు 2% నష్టంతో రూ.11.27 వద్ద ముగిసింది.

# రిలయన్స్ జియో రూ.40,000 కోట్ల ఐపీఓ

**-సంస్థ విలువ రూ.16.20 లక్షల కోట్లు**
**-2.5% వాటా విక్రయించే అవకాశం**




దేశంలోనే అతిపెద్ద తొలి పబ్లిక్ ఆఫర్‌కు ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాదిలోనే తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. గత నవంబరులో రిలయన్స్ జియో విలువను 180 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.16.20 లక్షల కోట్లు)గా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జెఫ్రీస్ అంచనా వేసింది. జియోలో 2.5% వాటా విక్రయించాలన్నది రిలయన్స్ ప్రణాళిక. అంటే ఈ స్వల్ప వాటా విక్రయంతోనే 4 4.5 బిలియన్ డాలర్ల (రూ.36,000 40,500 కోట్ల) వరకు సంస్థ సమీకరించే అవకాశం ఉంది. ఇదే జరిగితే ఇప్పటివరకు మనదేశంలో అతిపెద్ద ఐపీఓగా రిలయన్స్ జియో రికార్డు సృష్టించనుంది. ప్రస్తుతం 50 కోట్ల మందికి పైగా చందాదారులతో దేశంలో అతిపెద్ద టెలికాం ఆపరేటర్‌గా జియో ఉంది. జియో ఐపీఓ కోసం మదుపర్లు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. గత ఆరేళ్లలో కృత్రిమ మేధ (ఏఐ) వంటి వైవిధ్య విభాగాల్లోకి జియో అడుగుపెట్టింది. కేకేఆర్, జనరల్ అట్లాంటిక్, సిల్వర్ లేక్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ వంటి అంతర్జాతీయ పెట్టుబడిదార్ల నుంచి ఈ సంస్థ నిధులు సమీకరించింది కూడా.

**—— ఐపీఓ కోసం ఇద్దరు బ్యాంకర్లు**

రిలయన్స్ జియో ఐపీఓ ముసాయిదాను సిద్ధం చేసేందుకు ప్రముఖ బ్యాంకర్లు మోర్గాన్ స్టాన్లీ, కోటక్ పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. 2026 ప్రథమార్థంలోనే జియో ఐపీఓ ఉండొచ్చని గత ఆగస్టులో జరిగిన రిలయన్స్ ఏజీఎంలో ముకేశ్ అంబానీ ప్రకటించారు. అయితే మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈ భారీ ఐపీఓ ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పెద్ద కంపెనీల ఐపీఓ పరిమాణ నిబంధనలు మారడం కోసం రిలయన్స్ ఎదురుచూస్తోందని వెల్లడించాయి.

**———ఆర్థిక శాఖ ఆమోదం తరవాతే**

అతిపెద్ద కంపెనీలు, పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధులు సమీకరించాలంటే, సంస్థలో కనీసం 5% వాటా విక్రయించాలన్నది నిబంధన. దీన్ని 2.5 శాతానికి తగ్గించాలన్న సెబీ ప్రతిపాదనకు ఆర్థిక శాఖ అనుమతి లభించాల్సి ఉంది. జియో కంపెనీ భారీ పరిమాణం నేపథ్యంలో, ఐపీఓ ద్వారా 2.5% వాటానే విక్రయించాలని మాతృసంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ భావిస్తోంది. జియో విలువను 200240 బి.డాలర్లు (సుమారు రూ.18 21.60 లక్షల కోట్లు)గా లెక్కకట్టాలని కొంత మంది బ్యాంకర్లు కోరుతున్నట్లు సమాచారం. దీనిపై రిలయన్స్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. జియో ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)గా రానుందా అనే దానిపై స్పష్టత లేదు. కొత్త షేర్ల జారీ లేదా ప్రస్తుత వాటాదార్ల షేర్ల విక్రయంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దక్షిణ కొరియా సంస్థ హ్యుందాయ్ అనుబంధ హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ.27,870 కోట్ల ఐపీఓ కూడా పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలోనే వచ్చింది.

# చిన్న స్టాక్ బ్రోకర్లకు ఉపశమనం

**—సాంకేతిక లోపాల నియమావళిలో సడలింపులు**



తక్కువ పరిమాణంలో క్లయింట్లు ఉండే స్టాక్ బ్రోకర్లకు ఉపశమనం కలిగించే నిర్ణయాన్ని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తీసుకుంది. స్టాక్ బ్రోకర్ల ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ వ్యవస్థల్లో సాంకేతిక లోపాలు తలెత్తితే, అమలు చేయాల్సిన నియమావళి విషయంలో సడలింపులు ఇచ్చింది. నిబంధనలను సరళతరం చేయడం, జరిమానాలను తగ్గించడం, చిన్న బ్రోకర్లను నిబంధనలను నుంచి మినహాయిస్తూ ఆదేశాలిచ్చింది. సవరించిన నియమావళి కింద, బ్రోకర్ నియంత్రణలో లేని లోపాలకు వారికి ఎటువంటి సంబంధం ఉండదు. నిబంధనలను సరళతరం చేయడం, మార్కెట్ ఇంటర్‌మీడియరీస్‌కు వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. పరిమిత వ్యాపారం, టెక్నాలజీపై తక్కువ ఆధారపడే చిన్న బ్రోకర్లను నిబంధనల నుంచి మినహాయించడానికి అర్హత ప్రమాణాల్లో మార్పులు చేసినట్లు సెబీ ప్రకటించింది. 60% మందికి ఊరట: స్టాక్‌బ్రోకర్ల ఈ నియమావళి 10,000 కంటే ఎక్కువ మంది నమోదిత క్లయింట్‌లు ఉన్న బ్రోకర్లకు మాత్రమే వర్తిస్తుంది. ఇంతమంది క్లయింట్లను కలిగి ఉండే బ్రోకర్లు దేశం మొత్తంమీద తక్కువగానే ఉంటారు. దీంతో ఈ విధాన నిబంధనల నుంచి 60% మంది బ్రోకర్లకు మినహాయింపు లభించనుంది. బ్రోకర్‌కు చెందిన ట్రేడింగ్ వ్యవస్థల బయట లోపాలు తలెత్తడం, ట్రేడింగ్‌పై ప్రభావం నేరుగా ప్రభావం చూపనవి లేదా స్వల్ప ప్రభావం వంటి వాటికి మినహాయింపు ఇచ్చారు. ఏదైనా సంఘటన జరిగితే ఎక్స్ఛేంజీలు, క్లయింట్‌లకు బ్రోకర్లు రెండు గంటల్లోగా సమాచారం ఇవ్వాలి. ఎక్స్ఛేంజీలు ఆ సమాచారాన్ని వారి వెబ్‌సైట్‌ల్లో ఉంచుతాయి. బ్రోకర్లు వారి ట్రేడింగ్ యాప్‌లు, వెబ్‌సైట్‌లు, ఎస్ఎంఎస్, ఇమెయిల్, పాప్ అప్ అలెర్ట్‌ల ద్వారా క్లయింట్‌లకు తెలియజేయాలి. ఘటన జరిగిన టీ+1 రోజులోగా ఎక్స్ఛేంజీకి ప్రాథమిక నివేదిక సమర్పించాలి. మరుసటి రోజు సెలవు దినం అయితే పొడిగింపులు లభిస్తాయి. సామూహిక్ ప్రతివేదన్ మంచ్ పోర్టల్ ద్వారా ఘటన జరిగిన 14 రోజుల్లోగా పూర్తి విశ్లేషణ నివేదిక దాఖలు చేయాలి. ఆర్థిక జరిమానాలను కూడా హేతుబద్ధీకరించారు. ఘటన తీవ్రత, ఫ్రీక్వెన్సీ బట్టి నిర్ణయాలు ఉంటాయి. సవరించిన నియమావళి వెంటనే అమల్లోకి వచ్చినట్లు సెబీ వెల్లడించింది. సవరించిన నియమావళి వెంటనే అమల్లోకి వచ్చినట్లు సెబీ వెల్లడించింది.

## డిజిటల్ మోసాలను అరికట్టాలంటే..

**–అందరూ కలిసి పనిచేయాలి**
**–నిబంధనల సారాన్ని ఆర్థిక సంస్థలు అర్థం చేసుకోవాలి**
**–ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా**



ఆర్థిక సంస్థలు కేవలం 'నిబంధనలను పాటిస్తున్నామా, లేదా' అని మాత్రమే చూసుకోకుండా.. వాటి సారాన్ని అర్థం చేసుకుని నడుచుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. డిజిటల్ మోసాలను అరికట్టడం కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారమిక్కడ జరిగిన 'థర్డ్ యాన్యువల్ గ్లోబల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ద కాలేజ్ ఆఫ్ సూపర్‌వైజర్స్'ను ఉద్దేశించి ఆర్‌బీఐ గవర్నర్ ప్రసంగించారు. 'డిజిటల్ ఛానళ్లు అనేవి సౌకర్యవంతంగా ఉంటూనే అందరికీ సేవలందించాలి. డిజిటలీకరణ వల్ల సేవలందించే సామర్థ్యం పెరుగుతోంది. ప్రత్యేక ఆర్థిక సేవలను తీసుకువచ్చేందుకు వీలు కలుగుతోంది. అదే సమయంలో నష్టభయాలు కలిగే అవకాశాలు, పరిణామాలూ పెరిగాయని, అందువల్ల నియంత్రణ సంస్థలు అప్రమత్తంగా ఉండాలి. నియంత్రణ సంస్థలు, నియంత్రిత సంస్థలు ఒక బృందంగా పనిచేయాలి. జాతి అభివృద్ధిలో భాగస్వాములుగా ఉండాలి. వృద్ధి, వ్యవస్థాగత స్థిరత్వం మధ్య సరైన సమతౌల్యాన్ని తెచ్చేందుకు కృషి చేయాలి. ముఖ్యంగా పెరుగుతున్న డిజిటల్ మోసాలను అరికట్టడానికి బ్యాంకులు, ఇతర సంస్థలు తమ టూల్స్, సాంకేతికత, ప్రక్రియలను మెరుగుపరచుకోవాలి. మ్యూల్ ఖాతాలు, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడం కోసం అనలిటిక్స్, టూల్స్ నిర్మాణంలో ఒకరికొకరు సహకరించుకోవాలి' అని మల్హోత్రా సూచించారు. 'వడ్డీ రేట్లు యథాతథంగానే ఉంచాలి': ఆర్‌బీఐ తన కీలక రేట్లను యథాతథంగానే ఉంచాలని పీడబ్ల్యూసీ పార్టనర్, ఎకనమిక్ అడ్వైజరీ సర్వీసెస్ లీడర్ రానేన్ బెనర్జీ అంటున్నారు. ఫిబ్రవరి 46న నిర్వహించనున్న ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ కనుక కీలక రేట్లను తగ్గిస్తే, 'బులెట్‌ను వృథా చేసుకోవడమే' అవుతుందని అన్నారు. 'వృద్ధి బాగుంది. ద్రవ్యోల్బణం తక్కువగా ఉంది. ఈ సమయంలో రేట్లు యథాతథంగా ఉంటేనే మంచిద'ని వివరించారు.

## రూ.4,000 కోట్ల సమీకరణకు ఉక్కు కంపెనీలు



రాబోయే 1218 నెలల్లో ఉక్కు, ఉక్కు సంబంధిత కంపెనీలు తొలి పబ్లిక్ ఆఫర్ల (ఐపీఓ) ద్వారా రూ.4,000 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతున్నట్లు మర్చంట్ బ్యాంకర్లు చెబుతున్నాయి. కొన్ని ఎంపిక చేసిన ఉక్కు దిగుమతులపై మూడేళ్ల పాటు సుంకాలు విధించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడమే ఇందుకు కారణమని అంటున్నాయి. ఏవన్ స్టీల్స్ ఇండియా, జిందాల్ సుప్రీం, స్టీల్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్, రాజ్‌పుతానా స్టెయిన్‌లెస్, జెర్మన్ గ్రీన్ స్టీల్ అండ్ పవర్, రెన్నిస్ట్రిప్స్, ఆర్‌కే స్టీల్ మ్యానుఫ్యాక్చరింగ్, కరమ్‌తర ఇంజినీరింగ్ వంటి కంపెనీలు మెయిన్‌బోర్డులో ఐపీఓకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాయని చెబుతున్నారు.

## పసిడి ఈటీఎఫ్‌లపై మక్కువ




స్టాక్ మార్కెట్లో హెచ్చుతగ్గులు నెలకొనగా, బంగారం ధరేమో అంతకంతకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే మదుపరులు గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)ల్లో పెట్టుబడులు పెంచుతున్నారు. భారతీయ మ్యూచువల్‌ఫండ్ల సంఘం (యాంఫీ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2025 డిసెంబరులో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి రూ.11,646 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ ఫండ్లలోకి నవంబరులో రూ.3,741 కోట్లు, అక్టోబరులో రూ.7,743 కోట్లే రావడం గమనార్హం. సిప్ పెట్టుబడులు రూ.31,000 కోట్లు: డిసెంబరులో క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) మార్గంలో మ్యూచువల్ ఫండ్లలోకి వచ్చిన మొత్తం పెట్టుబడులు జీవితకాల గరిష్ఠమైన రూ.31,001.67 కోట్లకు చేరాయి. పరిశ్రమ మొత్తం ఆస్తుల్లో సిప్ వాటా 20.7 శాతానికి చేరింది. సిప్ ఖాతాల సంఖ్య 9.78 కోట్లకు చేరువైంది.సిప్ ద్వారా పెట్టుబడులు పెరిగినా, పరిశ్రమ మొత్తం నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) డిసెంబరు చివరికి స్వల్పంగా తగ్గి, రూ.80.23 లక్షల కోట్లుగా నమోదైంది. నవంబరులో ఇది రూ.80.80 లక్షల కోట్లుగా ఉంది. డిసెంబరు త్రైమాసికం ముగింపు కావడం, కార్పొరేట్లు లిక్విడిటీ అవసరాల కోసం డెట్ ఫండ్ల నుంచి నిధులు వెనక్కి తీసుకోవడమే ఇంద]ుకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సగటు నిర్వహణ ఆస్తుల విలువ (ఏఏయూఎం) రూ.81.98 లక్షల కోట్లుగా ఉంది. 19.9% వృద్ధి.. యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని: మార్కెట్ విలువల మార్పుల వల్ల, ఏయూఎంలో స్వల్ప తగ్గుదల కనిపించిందని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని పేర్కొన్నారు. సిప్ పెట్టుబడులు రూ.31,000 కోట్ల స్థాయికి చేరడం.. చిన్న మదుపరులకు మార్కెట్‌పై ఉన్న నమ్మకాన్ని సూచిస్తోందన్నారు. ఏడాది ప్రాతిపదికన పరిశ్రమ 19.9% వృద్ధిని సాధించిందని వివరించారు. కొత్తగా జతచేరిన 26.40 లక్షలతో కలిపి, మొత్తం ఫోలియోల సంఖ్య 26.12 కోట్లకు చేరింది. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లలోకీ నికర పెట్టుబడులు రూ.10,756 కోట్లు వచ్చాయి.

# ఆరు ఐపీఓలు.. ఐదు లిస్టింగ్‌లు.. భారత్ కోకింగ్ కోల్‌పైనే ఫోకస్




ప్రైమరీ మార్కెట్‌లో పబ్లిక్ ఇష్యూల (IPO) సందడి వచ్చే వారమూ కొనసాగనుంది. జనవరి 12 నుంచి 16 మధ్య ఆరు పబ్లిక్ ఇష్యూలు ప్రారంభం కానున్నాయి. ఇందులో అమాగీ మీడియా ల్యాబ్స్ మెయిన్‌బోర్డు కేటగిరీకి చెందినది కాగా.. మిగిలిన ఐదు ఎస్ఎంఈ సెగ్మెంట్‌వి. భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ సహా మరో మూడు కంపెనీలు వచ్చేవారం లిస్టింగ్‌కు సిద్ధమవుతున్నాయి. క్లౌడ్ ఆధారిత యాడ్ టెక్, మీడియా టెక్నాలజీ కంపెనీ అయిన అమాగీ మీడియా రూ.1789 కోట్ల ఐపీఓ జనవరి 13న ప్రారంభం కానుంది. జనవరి 16న ముగియనుంది. ఐపీఓలో భాగంగా ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.343361గా నిర్ణయించింది. ఈ కంపెనీ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ కానున్నాయి. ప్రస్తుతం కంపెనీ గ్రే మార్కెట్ ప్రీమియం 10 శాతంగా ఉంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.816 కోట్లు సమీకరిస్తుండగా.. వాటాదారులు 972.6 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయిస్తున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను టెక్నాలజీ, క్లౌడ్ ఇన్‌ఫ్రా, కంపెనీ వృద్ధికి వినియోగించనుంది.

**——ఎస్ఎంఈ కేటగిరీలో..**

జనవరి 12న నర్మదేశ్ బ్రాస్ ఇండస్ట్రీస్ (షేరు ధర రూ.515), అవానా ఎలక్ట్రోసిస్టమ్స్ (రూ.5659) పబ్లిక్ ఇష్యూల సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. జనవరి 13న జీఆర్ఈ రెన్యూ ఎనర్‌టెక్ (రూ.100 105), ఇండో ఎస్ఎంఎస్ (రూ.141149) ఐపీఓకు రానున్నాయి. 14న ఆర్మర్ సెక్యూరిటీ ఇండియా (రూ.5557) ఐపీఓ ప్రారంభం కానుంది.

**——భారత్ కోకింగ్ కోల్ లిస్టింగ్‌పైనే చూపంతా..**

కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ ఐపీఓకు అనూహ్య స్పందన లభిస్తోంది. శుక్రవారం పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కాగా.. ఇన్‌స్టిట్యూషనల్, నాన్ ఇన్‌స్టిట్యూనల్ ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొన్న వేళ తొలిరోజే 8 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. 13తో సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. జనవరి 16న లిస్ట్ కానుంది. ప్రస్తుతం గ్రే మార్కెట్ ప్రీమియం 39 శాతంగా ఉంది. దీంతో ఎంత ప్రీమియంతో లిస్ట్ అవుతుందోనన్న ఆసక్తి నెలకొంది. ఎస్ఎంఈ కేటగిరీలో గ్యాబియన్ టెక్నాలజీస్, విక్టరీ ఎలక్ట్రిక్ వెహికల్స్, యజుర్ ఫైబర్స్ లిమిటెడ్ లిస్టింగ్ రానున్నాయి.

## బ్యాంకుల లాభంలో 75 శాతానికి డివిడెండ్ చెల్లింపులు పరిమితం

బ్యాంకులు తమ వాటాదార్లకు చెల్లించే డివిడెండ్లను, నికర లాభంలో 75 శాతానికి పరిమితం చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రతిపాదించింది. ఈక్విటీ షేర్లపై చెల్లించే మొత్తాలను డివిడెండ్‌గా ఆర్‌బీఐ నిర్వచించింది. ఇందులో మధ్యంతర డివిడెండ్ కూడా ఉంటుంది. అయితే పర్‌పెచ్యువల్ నాన్ క్యుములేటివ్ ప్రిఫరెన్స్ షేర్లపై డివిడెండ్‌ను ఈ పరిమితి నుంచి మినహాయించింది. గరిష్ఠంగా డివిడెండ్ చెల్లింపును లెక్కించడానికి కొత్త పద్ధతిని ప్రతిపాదిస్తూ ముసాయిదాను ఆర్‌బీఐ జారీ చేసింది. ఇందులో భాగంగా డివిడెండ్‌లను ప్రకటించడానికి ముందు దీర్ఘకాలిక వృద్ధి ప్రణాళికలు, మూలధన స్థితిని బ్యాంకుల బోర్డు డైరెక్టర్లు పరిగణనలోకి తీసుకోవాలి. డివిడెండ్ చెల్లింపునకు ప్రతిపాదించిన కాలానికి బ్యాంకులు నికర లాభం నమోదుచేసి ఉండాలి.

## సుకుమారి దామిని



ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'ఓ..! సుకుమారి'. తిరువీర్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని భరత్ దర్శన్ తెరకెక్కిస్తున్నారు. మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. శనివారం ఐశ్వర్య పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఆమె ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. తనిందులో దామిని అనే పల్లెటూరి అమ్మాయిగా అలరించనున్నట్లు ఆ ప్రచార చిత్రంతో స్పష్టత ఇచ్చారు. ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే వినోదాత్మక చిత్రంగా ముస్తాబవుతోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: భరత్ మంచిరాజు, ఛాయాగ్రహణం: సిహెచ్ కుషేందర్.

## రోమియో.. ఎక్కడున్నావ్!







అగ్రతారల సరసన అవకాశాలు అందుకుంటూ జోరు మీదుంది బాలీవుడ్ కథానాయిక త్రిప్తి దిమ్రీ. ప్రస్తుతం ప్రభాస్‌కి జోడీగా 'స్పిరిట్' సినిమాతో బిజీగా ఉన్న ఆమె ఖాతాలో 'ఓ రోమియో' చిత్రం ఉన్న సంగతి తెలిసిందే. ఆమె, హిందీ హీరో షాహిద్ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రమిది. విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "హేయ్ రోమియో.. నువ్వు ఎక్కడున్నావు" అనే వ్యాఖ్యను జోడించింది. 'నాతో గొడవ పెట్టుకునేంత ధైర్యం ఎవరికుంది?' అంటూ సాగుతున్న ఈ టీజర్‌లో షాహిద్ యాక్షన్ అవతారంలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. రివేంజ్ ప్రేమకథగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో విక్రాంత్ మాస్సే, తమన్నా, నానా పటేకర్ తదితరులు కీలక పాత్రల్లో మెరవనున్నారు. సాజిద్ నడియాడ్ వాలా నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 13న థియేటర్లలోకి రానుంది.

## ఆ ఒక్క సినిమా చేస్తే రికార్డ్ నాదే!

ప్రేక్షకులకు గుర్తుండిపోయే ఓ అనుభవాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో కథానాయకులు చిరంజీవి, వెంకటేశ్ కలిసి తీసుకున్న నిర్ణయమే... 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమా. ఇద్దరు హీరోలు ఇలాంటి ఓ కథని స్వాగతించి సినిమా చేయడమన్నదే ఎంతో ప్రత్యేకమైన విషయం. మంచి కథలు కుదిరినప్పుడు ఇలాంటి అద్భుతాలే జరుగుతాయి'' అన్నారు అనిల్ రావిపూడి.



వరుసగా అగ్ర కథానాయకులతో సినిమాలు చేస్తూ ఘన విజయాల్ని సొంతం చేసుకుంటున్న దర్శకుడీయన. గతేడాది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురిపించిన ఆయన... ఈసారి చిరంజీవి, వెంకటేశ్‌ని కలిపి 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాని తెరకెక్కించారు. ఈ చిత్రం ఈనెల 12న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా అనిల్ శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు. ''ఇంటిల్లిపాదీ కలిసి చూసే వినోదం ఉన్న సినిమాలు సంక్రాంతి పండగకు వస్తే అద్భుతమైన ఫలితాలు లభిస్తాయి. 'సరిలేరు నీకెవ్వరు', 'అల వైకుంఠపురములో', 'సంక్రాంతికి వస్తున్నాం...' ఇలా గతంలో వచ్చిన చాలా సినిమాలు దుమ్ము దులిపేశాయి. కథలు బాగున్న అన్ని సినిమాలూ ఆడతాయి. ఈ సంక్రాంతికి కూడా అన్నీ వినోద ప్రధానమైన సినిమాలే వస్తున్నాయి. అన్నీ విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఇక నా విషయానికొస్తే... 'అనిల్ సంక్రాంతికి వచ్చి మంచి వినోదం పంచుతున్నాడు' అనే గుర్తింపు చాలు. అంతేకానీ, నాపైన ప్రత్యేకంగా సంక్రాంతి ముద్ర వస్తే అది నాపైన ఒత్తిడిని పెంచుతుంది. మానవీయ సంబంధాలతో కూడిన కథలతో నేను తీస్తున్న సినిమాలు ప్రతి కుటుంబానికీ చేరువవుతున్నాయి. 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాలోనూ హాస్యంతోపాటు, బలమైన భావోద్వేగాలూ ఉంటాయి''.

''ఒక కథని హీరో పాత్ర కోణంలో చెప్పే ప్రయత్నం ఈ సినిమాలో కనిపిస్తుంది. ఈమధ్యకాలంలో ఇలాంటి పాత్రలతో నేను సినిమా చేయలేదు. అదే నాకు కొత్తగా అనిపించింది. శంకరవరప్రసాద్ పాత్రకి కోపం వస్తే ఎలా ఉంటుంది? నవ్వు వస్తే ఎలా ఉంటుంది? ఆయా సందర్భాల్లో ఆ పాత్ర చేసే ప్రయాణం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. భార్యాభర్తల మధ్య ఒక సమస్య వచ్చినప్పుడు వాళ్లు దాన్ని ఎలా స్వీకరించారు? ఎలా పరిష్కారమైందనే విషయాల్ని ఈ కథలో కొత్త కోణంలో చూపించాం. భార్యాభర్తలు, పిల్లల నేపథ్యంలో భావోద్వేగాల్ని తెరపై చూస్తున్నప్పుడు ప్రతి ఒక్కరిలోనూ ఇది నిజమే కదా అనే భావన కలుగుతుంది. చిరంజీవి సినిమాల్లోకి పునః ప్రవేశం చేసిన తర్వాత 'అన్నయ్య', 'బావగారూ బాగున్నారా', 'చూడాలని ఉంది' తరహా కుటుంబ కథల్ని ఆయన మళ్లీ చేయలేదు. ఘన విజయాల్ని అందించిన ఈ జానర్‌లోనే ఆయనతో సినిమా చేయాలని ఈ కథని రాసుకున్నా. ఈ ఆలోచన చెప్పగానే కథానాయకులు ఇద్దరికీ నచ్చింది. చిరంజీవి తెరపై చేసే అల్లరి, ఆయన ఇమేజ్‌కి తగ్గ మాస్ అంశాలు, ఆయన పంచే భావోద్వేగాలు చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు టైమ్ మిషన్ ఎక్కి ప్రయాణం చేసిన అనుభూతి కలుగుతుంది''.

''సినిమాకి ఎక్కడ ఖర్చు పెట్టాలి? ఎక్కడ తగ్గించుకోవాలి? ఎన్ని రోజుల్లో పూర్తి చేయాలనే విషయాల్లో నిర్మాతల కంటే నేనే ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటా. రోజూ సినిమా చిత్రీకరణకు అయిన వ్యయం నాకు వాట్సప్‌లో వస్తూ ఉంటుంది. నేనే ఓ నిర్మాతలా భావించి సినిమాలు చేస్తుంటా. నిర్మాత తన జీవితాన్ని పణంగా పెట్టి సినిమా చేస్తారు. లాభం మాట తర్వాత, సినిమా బయటకు వచ్చే సమయానికి పెట్టిన డబ్బు తిరిగొచ్చిందనే భరోసాతోనైనా ఉండాలి. అలాంటి ఆలోచనలతో సినిమాలు చేయడంతోనే నా నిర్మాతలంతా సంతోషంగా ఉన్నారు. 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాకి భారీగా ప్రారంభ వసూళ్లు వస్తాయి. ఇలాంటి సినిమాల కోసం ప్రేక్షకులు ఎదురు చూస్తుంటారు. అగ్ర కథానాయకులైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్‌లతో సినిమాలు చేశా. మరో అగ్ర హీరో నాగార్జునతో సినిమా ఎప్పుడు అని అందరూ అడుగుతున్నారు. ఆయనతో ఓ సినిమా చేయాలని నాకూ ఉంది. ఆ సినిమా చేస్తే నలుగురు అగ్ర హీరోలతో సినిమా చేసిన ఈతరం దర్శకుడిగా రికార్డ్ నాదే అవుతుంది. తదుపరి సినిమాపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. రెండు వారాలు విశ్రాంతి తీసుకుని ఆ తర్వాత కొత్త సినిమా గురించి ఆలోచిస్తా''. ''ఇద్దరు అగ్ర కథానాయకుల్ని ఒక కథలోకి తీసుకు రావడమనేది మామూలు విషయం కాదు. చాలా జాగ్రత్తలు తీసుకోవల్సి ఉంటుంది. ఈ విషయంలో చిరంజీవి, వెంకటేశ్ నాకు చాలా స్వేచ్ఛనిచ్చారు. వారి మధ్య మంచి స్నేహం ఉంది. దాంతో నా పని మరింత సులభమైంది. ఆ ఇద్దరూ కలిసి చేసిన 18 రోజుల చిత్రీకరణ నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఇద్దరూ 20 నిమిషాలపాటు తెరపై కనిపిస్తారు. వెంకటేశ్ కర్ణాటక నుంచి వచ్చిన వెంకీ గౌడ అనే బిజినెస్ మ్యాన్ పాత్రలో కనిపిస్తారు. మనం నిజాయతీగా ఒకటి కోరుకున్నప్పుడు, అందులోని ఉద్దేశం అవతలివాళ్లకు అర్థమైనప్పుడు అన్నీ అనుకూలంగా జరుగుతాయని నేను నమ్ముతా. కథానాయిక నయనతార విషయంలోనూ అదే జరిగింది. ఆమె చాలా నిజాయతీగా ఉంటారు. ఒక విషయాన్ని బలంగా నమ్మారంటే కచ్చితంగా చేస్తారు. ఆమె అడగ్గానే ప్రమోషనల్ వీడియోలు చేశారు''.

## ప్రభాస్ ఓల్డ్ గెటప్ సీక్వెన్స్‌తో ది రాజాసాబ్!



ది రాజాసాబ్' సినిమాలోని కొత్త పాయింట్ గురించి అందరూ మాట్లాడుకుంటున్నార''న్నారు దర్శకుడు మారుతి. ఈ చిత్ర ఫలితాన్ని ఒక్క షోతోనో, ఒక్కరోజులోనో నిర్ణయించకూడదని, పదిరోజులు ఆగితే ఈ సినిమా ఏంటో తెలుస్తుందని తెలిపారు. అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రభాస్ ఓల్డ్ గెటప్ ఎపిసోడ్‌ను శనివారం సాయంత్రం నుంచే సినిమాలో కలుపుతున్నట్లు ప్రకటించారు. ప్రభాస్ టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రానికి మారుతి దర్శకత్వం వహించగా.. టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో బ్లాక్‌బస్టర్ మీట్ ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మాట్లాడుతూ.. ''నాకు ఈ సినిమా చేసే అవకాశమిచ్చిన ప్రభాస్‌కు జీవితాంతం రుణపడి ఉంటా. ఆయన్ని ప్రేక్షకులు ఎలా చూడాలని అనుకుంటున్నారో సినిమాలో అలాగే చూపించాను. మైండ్ గేమ్‌గా సాగే 40నిమిషాల క్లైమాక్స్ సీక్వెన్స్ అందరికీ బాగా నచ్చింది. ఇప్పటిదాకా ఇండియన్ స్క్రీన్‌పై ఒక కమర్షియల్ హీరోతో ఇలాంటి మైండ్ గేమ్ సినిమా రాలేదని ప్రతిఒక్కరూ మెచ్చుకుంటున్నారు. ప్రభాస్‌తో నేను సింపుల్‌గా ఓ కమర్షియల్ సినిమా తీసేయొచ్చు. కానీ, ఇలాంటి కొత్త కథల్ని పెద్ద హీరోలు చేయాలి.. ప్రేక్షకులకు చూపించాలని ఆయన సంకల్పించారు. అందుకే ఇలా ఓ వినూత్న పాయింట్‌తో సినిమా చేశాం. అది కామన్ ఆడియన్స్‌కు చక్కగా రీచ్ అయింది.

నిజానికి ఇలా కొత్త పాయింట్‌తో వచ్చిన సినిమా ఒక్కరోజులోనే అందరికీ నచ్చి.. పెద్ద హిట్టవ్వాలనేం లేదు. అది జనాల్లోకి వెళ్లడానికి కాస్త సమయం పడుతుంది. దీంట్లో మేము చెప్పాలనుకున్న అంశాన్ని అర్థం చేసుకున్న వాళ్లు ఒకలా మాట్లాడుతున్నారు.. అర్థం కాని వాళ్లు తిడుతున్నారు. ఏదేమైనా ఓ చిత్ర ఫలితాన్ని అప్పుడే నిర్ణయించేయకండి. మేము ఈ చిత్ర టీజర్, ట్రైలర్లలో ప్రభాస్ ఓల్డ్ గెటప్‌ను చూపించాం. సినిమాలో అది కనిపించకపోవడంతో చాలా మంది సినిమాని ఆస్వాదించలేకపోతున్నారు. వాళ్ల కోసం ఆ ఎపిసోడ్‌ను సినిమాలో జత చేస్తున్నాం. ద్వితీయార్ధంలో కొన్ని సన్నివేశాల్ని తగ్గించి.. కొత్తగా 8నిమిషాల సన్నివేశాల్ని జత చేస్తున్నాం. ఈ హారర్ ఫాంటసీ చిత్రాన్ని సోమవారం నుంచి అందరూ సాధారణ టికెట్ ధరల్లోనే చూడొచ్చు'' అన్నారు.

''ఈ విజయం పట్ల సంతోషంగా ఉన్నాం. తొలిరోజు రూ.100కోట్ల వసూళ్లు వస్తాయని ఆశించాం. మా అంచనాల్ని మించి రూ.112కోట్ల వసూళ్లు దక్కాయి. ఇది మంచి హారర్ ఫాంటసీ సినిమా. దీన్ని చూసేందుకు పిల్లలతో పాటుగా కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు వస్తున్నారు'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. ఈ కార్యక్రమంలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ పాల్గొన్నారు.

## ఎవ్వరికీ కనిపించకుండా ఏడ్చా



కామెడీ అంటే నాకు చాలా ఇష్టం. కుదిరితే మరిన్ని కామెడీ సినిమాలు చేయాలని ఉంది. ఇలాంటి కథల్లో నటిస్తున్నప్పుడు మనసుకెంతో ఉత్సాహంగా ఉంటుంది. సన్నివేశాలు చేస్తున్నప్పుడే నవ్వుకుంటుంటాం. ప్రయాణమంతా సరదా సరదాగా సాగిపోయిన అనుభూతి కలుగుతుంది. సీరియస్ సినిమాలు చేస్తున్నప్పుడైతే... సెట్‌లోకి వెళ్లడానికి ముందే ఆ పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసి, సన్నివేశానికి తగ్గట్టుగా మైండ్ సెట్‌ని మార్చుకుని నటించాల్సి ఉంటుంది. ఈ ప్రయాణమంతా కొంచెం అలసటగా అనిపిస్తుంటుంది.

**ఇంతకీ ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

ఒక హీరో, ఇద్దరు హీరోయిన్లు అనగానే అందరికీ ముక్కోణపు ప్రేమకథలే గుర్తొస్తాయి. ఒకరికి తెలియకుండా, మరొకరిని ప్రేమించడమో లేదంటే ఇతరత్రా గందరగోళమో ఆయా కథల్లో కనిపిస్తుంటుంది. కానీ ఇది అలాంటి కథ కాదు. చాలా స్పష్టంగా, సందర్భోచితమైన హాస్యంతో సాగుతుంది. ప్రేయసి, మాజీ ప్రేయసి, ప్రేమికుడి చుట్టూ ఈ కథ సాగుతుంది. ఒక మహిళను ఎలా గౌరవించాలనే విషయాన్ని సున్నితంగా చూపించారు. ప్రతి పాత్రకీ సరైన ముగింపు ఉంటుంది. ఇందులో నేను దియా అనే యువతిగా కనిపిస్తా. కథలో నా పాత్రకు దక్కిన ప్రాధాన్యాన్ని బాగా ఆస్వాదించా. రచయితలు భాను, నందు సన్నివేశాల్ని బాగా రాశారు. దర్శకుడు రామ్ అబ్బరాజు ఎలాంటి టెన్షన్ లేకుండా కూల్‌గా సినిమాని పూర్తి చేశారు.

**కథానాయకుడు శర్వానంద్‌తో కలిసి నటించిన అనుభవాన్ని పంచుకుంటారా?**

చిత్రీకరణ మొదలైన తొలి రోజే చాలా సంభాషణలున్న ఓ సన్నివేశం చేయాల్సి వచ్చింది. అలాంటి సన్నివేశాలు చేస్తున్నప్పుడు సహనటుల సహకారం చాలా కీలకం. తొలి రోజే శర్వానంద్ సెట్‌లో ఎంత ప్రశాంతంగా ఉంటారో అర్థమైంది. దాంతో ఎలాంటి ఒత్తిడి లేకుండా నటించా. నాతోపాటు నటించిన మరో కథానాయిక సాక్షి వైద్య కూడా తపన కలిగిన నటి. ప్రతి సంభాషణనీ పేపర్‌పై రాసుకుని సన్నివేశాల కోసం సిద్ధమయ్యేది. మా ఇద్దరి మధ్య సన్నివేశాలు కూడా బాగుంటాయి.

**2025 ఎలా సాగింది? కొత్త ఏడాది మీ ప్రణాళికలు ఏమిటి?**

గతేడాది ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమాలు చేశాను. 'అఖండ 2', 'స్వయంభూ', విజయ్ సేతుపతి పూరి కలయికలోని సినిమా, 'నారీ నారీ నడుమ మురారి'... ఈ సినిమాలన్నీ నా కెరీర్‌కి ఎంతో కీలకమైనవి. కెరీర్ పరంగా తీసుకుంటున్న నిర్ణయాల్లో నేను చాలా స్పష్టతతో ఉన్నా. 'బింబిసార', 'విరూపాక్ష', 'సార్', 'డెవిల్'... ఇలా ఒకదానికొకటి భిన్నమైన కథల్ని ఎంచుకుంటూ ప్రయాణం చేస్తున్నా. భవిష్యత్తులోనూ ఇంతే. ఈమధ్య బయోపిక్స్‌లో నటించాలనే కోరిక కలిగింది. ప్రస్తుతానికి నా ముందున్న కలల సినిమా అంటే అదే. యామీగౌతమ్ నటించిన 'హక్' చూసి ఎంతో స్ఫూర్తి పొందా. ఫ్లైట్‌లో ఆ సినిమా చూస్తూ ఎవ్వరికీ కనిపించకుండా ఏడ్చాను. అంతగా ప్రభావితం చేసింది. నిజ జీవిత కథలు, అహల్యాబాయి లాంటి శక్తిమంతమైన మహిళల పాత్రలు చేసే అవకాశం వస్తే తప్పకుండా చేస్తా.

## మహిళా పోలీస్ ఫ్రాంచైజ్.. 'మర్దానీ 3' వచ్చేస్తోంది..

రాణీ ముఖర్జీ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం "మర్దానీ 3". దేశంలోనే అతిపెద్ద మహిళా పోలీస్ ఫ్రాంచైజీగా మర్దానీ రికార్డు సృష్టించింది. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీ నుంచి వచ్చిన రెండు భాగాలు బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. తాజాగా మూడో పార్ట్ విడుదల తేదీ ప్రకటించారు. జనవరి 30న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఓ పోస్టర్ వదిలారు. నిజానికి ఈ సినిమాను హోలి పండగ సందర్భంగా ఫిబ్రవరి 27న విడుదల చేస్తామని గతంలో ప్రకటించారు. ఇప్పుడు ఆ రిలీజ్‌ను ఓ నెల ముందుకు జరిపారు.

సినిమా

మర్దానీ 3 విషయానికి వస్తే.. అన్యాయం, అక్రమాలను ఎదురించే డేర్ డెవిల్ పోలీస్ శివానీ శివాజీరాయ్‌గా రాణీ ముఖర్జీ మరోసారి కనిపించనున్నారు. 'ద రైల్వేమెన్' ఫేమ్ ఆయుష్ గుప్తా కథ అందించాడు. అభిరాజ్ మినావాలా దర్శకత్వం వహించగా, యశ్ రాజ్ ఫిలింస్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించారు. మంచికి, చెడుకు మధ్య జరిగే పోరాటాల్ని సినిమాలో చూపించనున్నారు.



## నా జీవితంలో అదో పీడకల



బాక్సింగ్‌లో ఎంత సాధించినా.. అభిమానులు సామాజిక మాధ్యమాల్లో తనను లక్ష్యంగా చేసుకుని విమర్శించారని భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ ఆవేదన వ్యక్తం చేసింది. విడాకులు, ఆర్థిక ఇబ్బందులు ఇలా తన కెరీర్‌లో చాలా క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొన్నానని ఆమె చెప్పింది. “2022 కామన్వెల్త్ క్రీడలకు ముందు గాయమైంది. కొన్ని నెలలు మంచానికే పరిమితమయ్యా. ఆ తర్వాత నా జీవితం మారిపోయింది. నేను ఎంతో నమ్మిన భర్త మోసం చేసినట్లు గ్రహించా. అందుకే విడాకులు తీసుకున్నా. అతడు నాకు తెలియకుండానే అప్పులు చేశాడు. నా ఆస్తిని తాకట్టు పెట్టాడు. అప్పులు తీర్చకపోవడంతో ఆ ఆస్తిని కోల్పోయా. ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నా. కొందరు నా గురించి ఏం తెలియకుండానే పిసినారి అని పేరు పెట్టారు. నా వ్యక్తిత్వాన్ని ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ శ్రుతి మించడంతో నోరు విప్పాల్సి వచ్చింది. నలుగురు పిల్లలు, తల్లిదండ్రుల బాధ్యత నాపైనే ఉంది” అని మేరీకోమ్ పేర్కొంది. 43 ఏళ్ల మేరీ 2023లో భర్త ఆన్లర్ నుంచి విడాకులు తీసుకుంది. ఈ జంటకు ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నారు.

# రోకో మెరుపులు మళ్లీ చూస్తామా?

**–న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ నేటి నుంచే**

ఇంకో పది రోజుల తర్వాత టీ20 సిరీస్.. ఆపై టీ20 ప్రపంచకప్.. అనంతరం ఐపీఎల్.. ఇలా వరుసగా పొట్టి క్రికెట్ సందడే సందడి. మళ్లీ వన్డేలు ఎప్పుడొస్తాయో.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను టీమ్ఇండియా జెర్సీల్లో ఎప్పుడు చూస్తామో! ఈలోపు ఈ ఇద్దరినీ న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో చూసే అవకాశం వచ్చింది. ఈ పోరు ఆదివారమే ఆరంభం కాబోతోంది. చివరగా దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో అదరగొట్టిన రోకో.. కివీస్‌పైనా జోరు కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. గాయంతో రెండు నెలలకు పైగా ఆటకు దూరంగా ఉన్న శ్రేయస్ అయ్యర్.. ఈ సిరీస్‌తోనే పునరాగమనం చేయనున్నాడు. 2024లో టీమ్ఇండియాను దాని సొంతగడ్డపై వైట్‌వాష్ చేసి ప్రకంపనలు రేపిన న్యూజిలాండ్ జట్టు.. మళ్లీ ఇప్పుడు భారత పర్యటనకు వచ్చింది. ఈసారి ఇరు జట్ల మధ్య పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌లు జరగబోతున్నాయి. ముందుగా మూడు వన్డేల పోరులో భాగంగా ఆదివారం వడోదరలో తొలి మ్యాచ్ జరగనుంది. టెస్టుల్లో ఎదురైన పరాభవానికి వన్డేలు, టీ20ల్లో ప్రతీకారం తీర్చుకోవాలని టీమ్ఇండియా చూస్తోంది. దక్షిణాఫ్రికాపై సత్తా చాటి జట్టుకు సిరీస్ విజయాన్నందించిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలపై మరోసారి భారీ అంచనాలున్నాయి. ఐపీఎల్‌కు ముందు రెండు నెలల విరామం తీసుకోబోతున్న రోకో ఈ సిరీస్‌పై తమదైన ముద్ర వేయాలని చూస్తున్నారు. గత ఏడాది అక్టోబరులో ఆస్ట్రేలియాతో రెండో వన్డే సందర్భంగా తీవ్రంగా గాయపడి ఆటకు దూరమైన శ్రేయస్ అయ్యర్.. ఈ సిరీస్‌లో ఆడబోతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఆడి ఫిట్‌నెస్, ఫామ్‌ను చాటుకున్న అతను.. కివీస్‌పై ఎలాంటి ప్రదర్శన చేస్తాడో చూడాలి.

**జోరు కొనసాగనీ..:** దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌ను 21తో భారత్ చేజిక్కించుకోవడంలో కోహ్లి, రోహిత్ కీలక పాత్ర పోషించారు. కోహ్లి మూడు మ్యాచ్‌ల్లో 2 శతకాలు, ఒక అర్ధశతకంతో 302 పరుగులు సాధిస్తే.. రోహిత్ రెండు అర్ధసెంచరీలతో 146 పరుగులు సాధించాడు. కివీస్‌తో సిరీస్‌లోనూ వీళ్లిద్దరూ జోరు కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. సఫారీలతో సిరీస్‌కు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రాహుల్ నుంచి తిరిగి సారథ్య బాధ్యతలు అందుకోనున్నాడు. ఫామ్‌తో తంటాలు పడుతూ టీ20 జట్టులో చోటు కోల్పోయిన అతను.. ఈ సిరీస్‌లో ఎలా రాణిస్తాడో చూడాలి. రోహిత్‌తో కలిసి అతనే ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. కోహ్లి మూడో స్థానంలో వస్తాడు. ఈ ముగ్గురు జట్టుకు బలమైన పునాది వేయాల్సిన అవసరముంది. గాయం నుంచి కోలుకుని వచ్చిన శ్రేయస్‌కు ఈ సిరీస్ ఎంతో కీలకం. అతను ఇందులో రాణిస్తే.. గాయపడ్డ తిలక్ వర్మ స్థానంలో కివీస్‌తో టీ20లు ఆడే అవకాశం వస్తుంది. కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా మిడిలార్డర్ భారాన్ని మోయనున్నారు. సుందర్, జడేజాలకు తోడు కుల్‌దీప్ స్పిన్ బాధ్యతలను పంచుకోనున్నారు. మధ్య ఓవర్లలో ప్రత్యర్థి బ్యాటర్లకు కళ్లెం వేసే బాధ్యత వీరిదే. బుమ్రా అందుబాటులో లేని నేపథ్యంలో సిరాజ్ పేస్ దళాన్ని ఎలా నడిపిస్తాడో చూడాలి. అతడికి తోడుగా పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా కూడా తుది జట్టులో ఉంటారు. ప్రాక్టీస్ సందర్భంగా గాయపడిన పంత్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడని సమాచారం.

**కివీస్.. కొంచెం కొత్తగా!:....** న్యూజిలాండ్ జట్టు మునుపటితో పోలిస్తే కొంచెం కొత్తగా కనిపిస్తోంది. విలియమ్సన్ సహా కొందరు సీనియర్లు ఆ జట్టుకు దూరమయ్యారు. ఇప్పటిదాకా భారత్‌లో ఆడిన అనుభవం లేని ఆటగాళ్లు కొందరు ఆ జట్టులో ఉన్నారు. ఓపెనింగ్‌లో నిక్ కెల్లీ.. పేస్ బౌలింగ్‌లో జాక్ ఫౌక్స్, మైకేల్ రే.. భారత సంతతికి చెందిన స్పిన్నర్ ఆదిత్య అశోక్.. ఆ జట్టులో కొత్త ముఖాలు. ఆల్‌రౌండర్ మైకేల్ బ్రేస్‌వెల్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న కివీస్‌కు డెవాన్ కాన్వే, డరెల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, విల్ యంగ్, హెన్రీ నికోల్స్, కైల్ జేమీసన్ లాంటి అనుభవజ్ఞుల అండ ఉంది. వీళ్లందరికీ భారత్‌లో ఆడిన అనుభవం ఉంది. ముఖ్యంగా మిచెల్, ఫిలిప్స్, కాన్వేలతో భారత బౌలర్లకు ముప్పు తప్పదు. బౌలింగ్‌లో జేమీసన్, ఫౌక్స్ కీలకం.

**––పిచ్, వాతావరణం?...** వడోదరలోని కొటాంబి స్టేడియంలో జరగబోయే తొలి పురుషుల వన్డే ఇదే. ఇక్కడి పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. ప్రస్తుత చలి వాతావరణం దృష్ట్యా పేసర్లకూ సహకారం అందుతుంది. మంచు వల్ల స్పిన్నర్లకు బంతిపై పట్టు చిక్కడం కష్టం. టాస్ గెలిచిన జట్టు ఛేదనకే మొగ్గు చూపొచ్చు. మ్యాచ్‌కు వర్షం ముప్పేమీ లేదు.





**––తుది జట్లు (అంచనా)....** భారత్: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్.

**––న్యూజిలాండ్....** డెవాన్ కాన్వే (వికెట్ కీపర్), నిక్ కెల్లీ, విల్ యంగ్, డరెల్ మిచెల్, హెన్రీ నికోల్స్, గ్లెన్ ఫిలిప్స్, మైకేల్ బ్రేస్‌వెల్ (కెప్టెన్), జాక్ ఫౌక్స్, కైల్ జేమీసన్, మైకేల్ రే, ఆదిత్య అశోక్.

# ముంబయి అలవోకగా.. దిల్లీపై ఘనవిజయం

**–హర్మన్‌ప్రీత్, నాట్‌సీవర్ మెరుపులు**

మహిళల ప్రిమియర్ లీగ్ ఆరంభ మ్యాచ్‌లో విజయానికి చేరువగా వెళ్లి, అనూహ్య ఓటమి చవిచూసిన ముంబయి ఇండియన్స్.. రెండో మ్యాచ్‌లో చెలరేగిపోయింది. బ్యాటుతో, బంతితో పూర్తి ఆధిపత్యం చలాయించిన డిఫెండింగ్ ఛాంపియన్.. దిల్లీ క్యాపిటల్స్‌ను అలవోకగా ఓడించింది. నాట్ సీవర్, హర్మన్‌ప్రీత్ కౌర్ మెరుపులతో భారీ స్కోరు సాధించిన ముంబయి.. అమేలియా కెర్, నికోలా కేరీల పదునైన బౌలింగ్‌తో దిల్లీని కట్టడి చేసింది. డబ్ల్యూపీఎల్ 4లో ముంబయి ఇండియన్స్ బోణీ కొట్టింది. శనివారం ఆ జట్టు 50 పరుగుల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (74 నాటౌట్; 42 బంతుల్లో 8×4, 3×6), నాట్‌సీవర్ బ్రంట్ (70; 46 బంతుల్లో 13×4) విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడడంతో మొదట ముంబయి 4 వికెట్లకు 195 పరుగుల భారీ స్కోరు సాధించింది. దిల్లీ బౌలర్లలో నందని శర్మ (2/26) ఆకట్టుకుంది. అనంతరం ఛేదనలో డీసీ తేలిపోయింది. అమేలియా కెర్ (3/24), నికోలా కేరీ (3/37), నాట్ సీవర్ (2/29), షబ్నిమ్ ఇస్మాయిల్ (1/14)ల ధాటికి 19 ఓవర్లలో 145 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో షినెలీ హెన్రీ (56; 33 బంతుల్లో 5×4, 3×6) మినహా బ్యాటర్లు తేలిపోయారు. కొత్త ఓపెనర్ లిజెలీ (10)ను నాలుగో ఓవర్లో నాట్‌సీవర్ ఔట్ చేయడంతో దిల్లీ పతనం మొదలైంది. ప్రమాదకర షెఫాలి వర్మ (8), లారా వోల్వార్ట్ (9)లను తర్వాతి ఓవర్లో నికోలా కేరీ బౌల్డ్ చేయడం.. కెప్టెన్ జెమీమా (1), మరిజేన్ కాప్ (10) కూడా ఎంతోసేపు నిలవకపోవడంతో దిల్లీ ఓటమి ఖరారైంది. మరోసారి అద్భుతంగా బౌలింగ్ చేసిన అమేలియా కెర్.. మిడిలార్డర్ పని పట్టింది. షినెలీ పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే ఉపయోగపడింది. హర్మన్‌ప్రీత్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలిచింది.



రెచ్చిపోయిన సీవర్, హర్మన్: మొదట ముంబయికి ఓపెనర్లు అమేలియా (4), కమలిని (16) ఆశించిన ఆరంభాన్నివ్వకపోయినా.. నాట్ సీవర్, హర్మన్‌ప్రీత్ కలిసి దిల్లీ బౌలర్లపై విరుచుకుపడడంతో స్కోరు 200కు దగ్గరగా వెళ్లింది. అలవోకగా బౌండరీలు బాదిన నాట్ సీవర్.. 14వ ఓవర్‌కే 70 మీదికి వచ్చింది. దీంతో ఆమె సెంచరీ చేస్తుందనిపించింది. కానీ తర్వాతి ఓవర్లో శ్రీచరణి.. సీవర్‌ను ఔట్ చేసింది. నాట్ సీవర్ ఉన్నంతసేపు ఆచితూచి ఆడిన హర్మన్.. ఆ తర్వాత చెలరేగిపోయింది. కేరీ (21) సహకారంతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది.

**ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్.....** అమేలియా (సి) లిజెలీ (బి) షినెలీ 0; కమలిని (సి) లిజెలీ (బి) నందని 16; నాట్ సీవర్ (సి) జెమీమా (బి) శ్రీ చరణి 70; హర్మన్‌ప్రీత్ నాటౌట్ 74; నికోలా కేరీ (బి) నందని 21; సజన నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 195; వికెట్ల పతనం: 12, 251, 3117, 4170; బౌలింగ్: మరిజేన్ కాప్ 40270; షినెలీ హెన్రీ 30321; శ్రీ చరణి 40451; నందని శర్మ 30262; స్నేహ్ రాణా 30320; మిన్ను మణి 30290

**దిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్......:** లిజెలీ లీ (సి) షబ్నిమ్ (బి) నాట్ సీవర్ 10; షెఫాలి (బి) నికోలా 8; లారా వోల్వార్ట్ (బి) నికోలా 9; జెమీమా (సి) కమలిని (బి) షబ్నిమ్ 1; మరిజేన్ కాప్ (సి) పూనమ్ (బి) నికోలా 10; నిక్కి ప్రసాద్ (బి) అమేలియా 12; షినెలీ (సి) నికోలా (బి) అమేలియా 56, స్నేహ్ (సి) నికోలా (బి) నాట్ సీవర్ 11; మిన్ను మణి (సి) కమలిని (బి) అమేలియా 7; శ్రీ చరణి నాటౌట్ 10; నందని (సి) అమన్‌జ్యోత్ (బి) సంస్కృతి 0; ఎక్స్‌ట్రాలు 11 మొత్తం: (19 ఓవర్లలో ఆలౌట్) 145; వికెట్ల పతనం: 115, 232, 333, 433, 546, 686, 7108, 8133, 9136; బౌలింగ్: షబ్నిమ్ ఇస్మాయిల్ 40141; నాట్ సీవర్ 30292; నికోలా కేరీ 40373; అమేలియా కెర్ 40243; త్రివేణి 10120; అమన్‌జ్యోత్ 20170; సంస్కృతి 1091

## యువీ చిట్కాలు.. సంజుకు కూడా



టీమ్ఇండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్.. శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ లాంటి యువ క్రికెటర్లను తీర్చిదిద్దడంలో ఎంత కీలక పాత్ర పోషించాడో తెలిసిందే. వీరిలో శుభ్‌మన్ భారత జట్టుకు టెస్టులు, వన్డేల్లో కెప్టెన్‌గా ఎదిగాడు. అభిషేక్ శర్మ టీ20 జట్టులో ఓపెనర్‌గా కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇప్పుడు సంజు శాంసన్ సైతం యువీ నుంచి చిట్కాలు తీసుకుంటుండడం విశేషం. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్, ఆ తర్వాత జరిగే టీ20 ప్రపంచకప్‌నకు సంజు సన్నద్ధమవుతున్నాడు.

## ముంబయి ఇండియన్స్ బోణీ.. దిల్లీ పై ఘన విజయం

మహిళల ప్రిమియర్ లీగ్ (WPL) 2026 సీజన్‌లో ముంబయి ఇండియన్స్ బోణీ కొట్టింది. నవీముంబయి వేదికగా.. దిల్లీతో జరిగిన మ్యాచ్‌లో 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 196 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన దిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో 145 పరుగులకు ఆలౌటైంది. చినెల్లె హెన్రీ (56; 33 బంతుల్లో 5×4, 3×6) మినహా మిగతావారెవ్వరూ పెద్దగా రాణించలేదు. ముంబయి బౌలర్లలో నికోలా కారీ, అమేలియా కేర్ చెరో 3 వికెట్లు పడగొట్టగా.. బ్రంట్ 2 వికెట్లు, ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా తలో వికెట్ తీశారు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. బ్రంట్ (70; 46 బంతుల్లో 13×4), హర్మన్ ప్రీత్ కౌర్ (74*; 42 బంతుల్లో 8×4, 3×6) అర్ధశతకాలతో చెలరేగారు. నికోలా కారీ (21), కమలిని (16) ఫర్వాలేదనిపించారు. దిల్లీ బౌలర్లలో నందిని శర్మ 2 వికెట్లు పడగొట్టగా.. హెన్రీ, శ్రీచరణి ఒక్కో వికెట్ తీశారు.



## మలేసియా ఓపెన్.. ముగిసిన సింధు పోరాటం

మలేసియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి పి.వి.సింధు పోరాటం ముగిసింది. సెమీస్‌లో ఓటమితో ఈ టోర్నీ నుంచి ఆమె (PV Sindhu) నిష్క్రమించింది. శనివారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో రెండో సీడ్ వాంగ్ జి యి (చైనా) చేతిలో సింధు 16-21, 15-21 వరుస గేమ్‌లు కోల్పోయి ఓటమిపాలైంది. ఈ టోర్నీలో ఇప్పటికే పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జోడీ కూడా క్వార్టర్స్ దశలోనే ఓడిపోయిన సంగతి తెలిసిందే.



## సెలక్టర్ల నిర్ణయాన్ని గౌరవిస్తా



టీ20 ప్రపంచకప్‌లో బరిలోకి దిగే భారత జట్టులో చోటు దక్కకపోవడంపై వేదాంత ధోరణిలో మాట్లాడాడు టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్. ఏడాది తర్వాత టీ20 జట్టులోకి పునరాగమనం చేసిన శుభ్‌మన్.. అంచనాలకు తగ్గట్లు రాణించకపోవడంతో సెలక్టర్లు అతడికి టీ20 ప్రపంచకప్‌లో తలపడే భారత జట్టులో చోటివ్వలేదు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ముంగిట దీని గురించి గిల్ స్పందించాడు. ‘‘నేను ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటాను. విధి నా కోసం ఏం రాసిందో అది జరుగుతుంది. దాన్ని ఎవ్వరూ మార్చలేరు. ఒక ఆటగాడిగా మనం ప్రపంచకప్‌లో ఆడితే జట్టును గెలిపించగలమనే నమ్మకం ఉంటుంది. కానీ సెలక్టర్ల నిర్ణయాన్ని నేను గౌరవిస్తా. ఒక ఆటగాడిగా ఎప్పుడూ వర్తమానంలో ఉండడం కీలకం. గతంలో ఏం జరిగింది, భవిష్యత్తులో ఏం జరుగుతుంది అన్నది ఎక్కువ ఆలోచించకూడదు’’ అని గిల్ పేర్కొన్నాడు.